# ఆకలి

"అమ్మా ! గంగమ్మ ఈ పూట పనిలోకి రాదట" అంది ప్రీతి.

"ఎవరు చెప్పారు?" అంది సునీత

"గంగమ్మ కూతురు రమణమ్మ వచ్చింది"

"వెళ్ళిపోయిందా?"

"అదిగో, నిలబడిందక్కడ?"

"ఏమే? పది గంటల వేళ దాకా కబురూ, కాకరకాయా లేక, ఇప్పుడొచ్చి చావు కబురు చల్లగా పంపిందా మీ అమ్మ! ఇలా అయితే పని మానీ మని చెప్పు. ఎక్కడ అంట్లు అక్కడే పడి ఉన్నాయి. మీ అమ్మ వస్తుంది కదానీ, నేను బట్టలు రేవు పెట్టుకుందామనుకొని తడిపి మోపెడు బట్టలు నాన బెట్టాను. ఆ చాకలీ అంతే, ఏ రెణ్ణెల్లకో వస్తుంది.

మాకు 'డబ్బులు మానాన డబ్బులు' ఖర్చూ, చాకిరీ అంతా చేసుకోక తప్పడమూ లేదు" అంటూ వంటింటో నుండి బయట కొచ్చిన సునీత రమణమ్మని చూసి కళ్ళప్పగించి వుండి పోయింది.

గుండెల్లో ఏదో కట్ అయినట్టయిపోయింది సునీతకు.

"ఏమే? ఈ గౌనెక్కడిదే?" అంది గుడ్లెర్రగా చేస్తూ, మొదలే సునీతను చూస్తే రమణమ్మ పులిని చూసినంత జడుసుకుంటుంది. అలాటిది అంత గట్టిగా గద్దించి అడిగే సరికి బిక్కచచ్చిపోయింది.

"మా అయ్య సంకురేతిరికి కొన్నాడు"

"అబద్ధాలాడకు ముష్ఠిముండా. చంపీగలను ఏమండోయ్ ఇలా వస్తారా?"

"వస్తున్నా" పాంటు వేసుకుంటున్న గోపాలం లోనుంచి కేకేశాడు. అయిదు నిమిషాలు ఆలస్యం అయ్యేసరికి "రమ్మనమనగానే ఎప్పుడొచ్చారు?" అంటూండగా -

"వస్తున్నాకదే"

"అటు చూడండి"

"ఏమయింది?" అన్నాడు.

"హుఁ మీ బుఱ్ఱంత వేగం పనిచేస్తే నాకింకేం కావాలి? ఎప్పుడూ ఏ ఆలోచనలో వుంటారో, మీకే తెలిదు అటు చూడండి. అది తొడిగిన గౌను చూడండి. పోయిన రేవులో బట్టలుతికే సుబ్బమ్మ దగ్గర వుండిపోయిన గౌను - అదే ప్రీతి కోసం ప్రత్యేకంగా మూడొందలిచ్చి కొన్న గౌను... ఇంకా గుర్తురాలేదా?"

"అలాగే వుంది"

"అయ్యో ఖర్మ! అలాగే వుండటమేంటండీ. అదే" అన్నది నెత్తికొట్టుకుంటూ.

"అబ్బా! నీకంత గాబరా దేనికి సునీతా? ఆ గౌను బట్టలుతికే సుబ్బమ్మ దగ్గరుంది కదా? దీనికెలా వస్తుంది?" చిరాగ్గా అన్నాడు.

"అంతే. మీకూ మీ పెద్దలకూ ఓ నమస్కారం అయినా మీకు చెప్పటమేంటి? మీ కెంత సేపు ముఖ్యాంకాయ కూర, గోంగూర పచ్చడి, కారప్పొళ్ళు తప్పితే ఈ లోకం కనిపించదసలు. పోనీండి నాకేంపోయింది" అనేసి నెత్తికొట్టుకొని, "వెళ్ళు తగలడవే" అనేసి "ఒసేయ్! సంక్రాంతికి కొంటే ఇంతవరకూ వేసుకోలేదెందుకే" అంది ఇంకా ఆ గౌను కూతురుదే అన్న అనుమానం మనసులో పీకుతుండగా.

"సరే ప్రపంచంలో అలాటి గౌను ఇంకెవరి దగ్గరా వుండదంటావా? మనిషిని పోలిన మనుషులే వుంటారు. గౌనును పోలిన గౌనుండదా? కంపెనీవాడు ఒక్క మోడలుకి ఒక్క గౌనే తయారు చేస్తాడా?" అన్నాడు చిరాగ్గా గోపాలం.

"మహాప్రభో మీకో నమస్కారం. మీకు ఓపికుంటే సుబ్బమ్మ దగ్గరకెళ్ళి ఆ గౌను తీసుకు రమ్మనండి మూడొందలిచ్చి మనం కొనుక్కున్నాం. గంగమ్మ మొగుడూ మూడొందలిచ్చి కొనే తాహతు కలవాడా? ఆ మాత్రం బుర్రపనిచేయదేమండీ మీకూ?" అంది సునీత.

సునీత దృష్టిలో ఆవిడో ఇందిరాగాంధీ. ఆడ మన్మోహన్ సింగ్. తన తెలివితేటలూ, చురుకుదనం భర్తకు లేదనేది ఆవిడ వేదన వాదన అంతకంటే 'అహం'! దానికి తోడు! 'నిజమే సుమా!' అనుకొని 'అంత డబ్బులిచ్చి ఎలా కొనగలిగాడు' అనుకున్నాడు. మనసులో అనుకోక భర్త బైటకే అనేయడంతో-

"భగవంతుడు ఆ బుర్రలో మెదడుకు బదులు ట్రాక్టరు మట్టి పెట్టేసి వుంటాడు" అంది భర్తను ఎద్దేవా చేస్తూ, భర్తను అస్తమానమూ ఎద్దేవా చేయడం, గడ్డిపోచతో సమానంగా చూడడంలో సునీత గొప్ప ఆనందాన్ననుభవిస్తుంది. గోపాలం అసిస్టెంట్ ఇంజనీరు కాబోతున్నాడు. ఇంజనీరింగ్‌లో గోల్డ్ మెడలిస్టు. సర్వీస్ కమీషన్‌లో ఫస్టురేంకు, మంచి ఆరేటరు.

ఎన్నోసార్లు ఎన్నో బహుమానాలు, అ వార్డులూ సంపాయించాడు. అతడు సంపాయించందల్లా ఒక్క దగ్గరే, అది భార్య దగ్గర!

మొదట్లో చాలా బాధపడేవాడు. కానీ 'తినగ తినగ వేము తియ్యనుండు' అని లోకాన్ని నాలుగు పాదాల్లో ఇమిడ్చి చూపిన వేమన అతడికి వేములో కమ్మదనాన్ని అందించ్చాడు.

అందు నుంచి సర్దుకొని "సరే, సుబ్బమ్మ దగ్గర కెళ్ళొస్తాను" అని స్కూటరు తీసుకెళ్ళాడు.

అప్పటికి శాంతించింది సునీత.

"వెళ్ళవే. ముష్టి మొహం నువ్వూనూ, మధ్యాహ్నం తగలడమను" అంది.

అదింకా కదల్లేదు. "ఏం? ఇంకా ఎందుకిక్కడ అఘోరిస్తున్నావ్?".

"మా అమ్మ పదిరూపాయ లిమ్మంది కుసింత టీ సుక్క పొయ్యమంది" అంది చెదురుతూ.

"ఏదీ లేదు, పాతిక లేదు, చేస్తే పని చెయ్యమను, లేకపోతే మానీమను, నెలకి పదిసార్లు

నాగా పెడుతూంది. డబ్బులు మాత్రం దొబ్బుకెలిపోతుంది'' అని కసిరేసి అదెళ్ళిపోతుంటే మళ్ళీ భయం వేసింది. గంగమ్మలా ఓర్మితో చేసే పనిమనిషి దొరకడం కష్టం అనుకొని "దాన్ని వుండమను' ' అని పర్సులోంచి పదికాగితం తీసి, ఫ్లాస్కులో టీ మూలనున్న గ్లాసులో పోసి పట్టుకెళ్ళమంది.

"చాకల్దే ఈ గౌను దీనికి అద్దెకిచ్చి వుంటుంది. వస్త్రారుగా తేలిపోతుంది. ఈ దెబ్బతో ఎన్నాళ్ళగానో మానిపించెయ్యాలనుకుంటోన్న చాకలిని మానిపించెయ్యాలి" అనుకుంది.

రమణమ్మ టీ పట్టుకెళ్ళింది.

గోపాలం స్కూటరు మీద వచ్చాడు. ఇదిగో! ప్రీతిగౌను" అనేసి "ఇప్పటికైనా నీ అనుమానం తీరిందా? లేక త్రోవలో దాని గౌను ఇప్పించి, తెచ్చేసానంటావా?'' అన్నాడు సీరియస్‌గా.

సునీతకు అలాటి అనుమానం వచ్చే వుండేది రమణమ్మ ఒక పావుగంట ముందెళ్ళి వుంటే దెబ్బతిన్న పులిలా కొంచెం వెనక్కి తగ్గినా, తగ్గితే లొంగిపోయినట్టువుతుందని, "నా మీద విరుచుకు పడతారేం? మీరూ అనుమాన పడ్డారు కదా?'' అంది.

సీరియస్‌గా చూసి ఊరుకున్నాడు.

"సారీ అండీ! అయినా గంగమ్మ మొగుడు ఏ షాపులోనో కొట్టేసుంటాడు లేకపోతే...'' అంటున్న ఆమెను మధ్యలో ఆపి-

'స్టాపిట్! సునీతా నువ్వు నోటికొచ్చినట్టుగా అనకు. వాళ్ళు కూటికి పేదవాళ్ళు! కాని పరువు ప్రతిష్ఠలక్కాదు. మన గౌను మన దగ్గరుంది కదా'' అన్నాడు, భర్త ముఖంలో కోపానికి జడిసి కొంచెం వెనక్కి తగ్గింది సునీత.

"సరే, కూరేం వండమంటారు?'' అంది.

"ఏదో చెయ్యి. నేను మధ్యాహ్నం భోజనానికి రాను. 'ఈ ఈ.' వస్తారు. పనుంది వస్తా' ' అన్నాడు.

నిట్టూర్చింది సునీత.

ఆ తరువాత ఓ రోజు-

"గంగమ్మా! రమణమ్మేసుకొచ్చిన ఆ గౌను నీ మొగుడెక్కడ కొన్నాడే?'' అడిగింది.

గంగమ్మ ముఖంలో కళ తప్పింది. కూతురు చెప్పిన మాటలు గుర్తుకొచ్చి.

ఓ రోజు సాయంకాలం రమణమ్మను పంపి గ్లాసులు కడిగి ఇల్లు తుడిచి రమ్మంది.

రమణమ్మ బితుకు బితుగ్గానే వెళ్ళింది. మళ్ళీ అది గౌను వేసుకొని.

"ఏమే! ఈ గౌను మరి విప్పవా? మీ అయ్య నిన్నే డాక్టర్ని చేసేద్దామనుకుంటున్నాడా? ఇంజనీర్ను చేద్దామనుకుంటున్నాడా? చింకి తలకి సంపెగనూనె అని నీ మొహానికి గౌనొక్కటేనేం? రవ్వల నెక్లెసూ ఏ.సీ.రూమ్ సంపాయించి పెట్టమను. ఇదిగో, రేపట్నించి కుర్చీ వేస్తా కూర్చొని

అంట్లుతోము ఆఫీను క్రింద కూర్చుని" అని చాలా సూటిపోటి మాటలంది. ఆ రోజు టిఫిన్ ఇవ్వలేదు. అడిగితే ఇంత ఉప్పు ముద్ద పేట్లో రపీమని కొట్టి "రేపట్నించీ ఈ గౌనేస్తే పన్లోకి రాకు. వస్తే మటుకు గౌనిప్పించేస్తా. టిఫిన్, గిఫినూ వుండదు" అంది.

అలాగే రెండ్రోజులు ఆ గౌనేసు కొచ్చినందుకు టిఫిన్ ఇవ్వలేదు.

ఆ మాటలన్నీ తల్లితో చెప్పి ఏడ్చిన రమణమ్మ ఆ గౌను మరి వేసుకోనని విసిరికొట్టింది.

గంగమ్మకి కోపం ముంచుకొచ్చింది. అయినా కోపాన్ని పెదవులు దాటి రానివ్వలేదు.

"గంగా! రమణమ్మ వేసుకొస్తోన్న గౌను మీ యజమాని ఎక్కడ కొన్నాడే?" అంది. మళ్ళీ

కళ్ళంట నీళ్ళు వస్తుంటే కొంగుతో తుడుచుకొని, దుఃఖాన్ని దిగమింగుకొని-

"గంటత్తంబం కెళ్ళే దార్లో రోడ్డు మీద డెబ్బయిరూపాయిలుకి కొన్నాడమ్మా డెబ్బయి రూపాయిలకి రెండు గౌన్లు తెమ్మంటే అమ్మికి బాగుంటాదని మోజు పడి కొనుక్కొచ్చిన్నాడు. అదింత తగువు తెస్తాదనుకో లేదు" అంది.

సునీతకు కోపం వచ్చింది. ఇవాళ అమీ, తుమీ తేల్చుకోవాలనుకుంది. ఆ సాయంకాలం భర్తకు చెప్పి లాభం లేదనుకొని తనే గౌను కొన్న షాపుకు స్వయం వెళ్ళింది. షాపు యజమాని సాదరంగాలోనికి ఆహ్వానించాడు.

"చూడండి! ఈ గౌను ఉగాదికి మీ దగ్గరే కొన్నాం" అంది.

షాపతను కంగారుగా"ఏమయిందమ్మా! ఒరే చూడండి ఏమయిందో?" అనగానే ముగ్గురు కుర్రాళ్ళొచ్చారు కంగారుగా.

"ఏమవలేదు"

"దీని ధర ఎంత?"

షాపు కుర్రాళ్ళు గౌను సైజు చూసి, ఆ కంపెనీ మార్కు చూసి "ముడొందలు" అన్నారు.

ఇంతలో షాపు యజమాని థంప్సప్ తెప్పించి "తాగండి" అన్నాడు.

" నో థాంక్సు" అని "ఇదే గౌను డెబ్బయి రూపాయలకూ ఇస్తారా?" అంది.

"డెబ్బయి రూపాయలకు తెస్తే మీకు వెయ్యి రూపాయలిస్తామమ్మా"

" మా పని మనిషి డెబ్బయి రూపాయలకు తెచ్చిందీ ఊళ్ళో" అన్నది సునీత.

"ఏషాపులో?"

"గంటస్తంభం దగ్గర. రోడ్డు మీద షాపుల్లో"

షాపు యజమాని విరగబడినవ్వాడు.

నవ్వి "రోల్డు గోల్డు నగలు బంగారం వస్తువల కంటే బాగుంటాయమ్మా. మీలాటోళ్ళకి చెప్పాలా?" అన్నాడు.

సునీత ముఖాన నెత్తురు చుక్క లేదు, అవమాన భారంతో పాలిపోయింది.

"లేదండీ! సేమ్ క్వాలిటీ. సేం డిజైన్" అంది.

"ఒరే. అమ్మగార్ని చివర రూంకి తీసికెళ్ళి స్టాకు చూపెట్టరా. చూడండమ్మా! మేం సాధారణంగా మీకీ విషయాలు చెప్పకూడదు. కానీ మీలాంటి బేరాలు వదులుకోకూడదు. అందుకే వెళ్ళి చూడండమ్మ" అన్నాడు.

ఆ కుఱ్ఱాడు పై అంతస్థులోకి తీసుకెళ్ళి మూడు వరుసలకి తిప్పి, చివరి గది తలుపు తీశాడు. "ఇవి చాలా సంవత్సరాల క్రితంవి తల్లీ. పాత స్టాకంతా ఇక్కడ పడేస్తాం. ఇవి ఆళ్ళు తీసికెళ్ళి సవగ్గా అమ్ముతారు. దశ బాగుంటే మన్నేస్తాయి. లేకపోతే మూనాళ్ళకే సిరిగిపోతాయి'' అన్నాడు.

సునీత గిఱ్ఱున వెను తిరిగిపోయింది.

భర్తకీ విషయం చెబితే తిడతాడని చెప్పలేదు. ఆ మర్నాడు రమణమ్మ వస్తే ఆ గౌనూ దానికిచ్చేయాలనుకుంది. అనుకున్నట్లే రమణమ్మ వచ్చింది. వీపు మీద, ముందుకీ చిరిగిపోయిన గౌనేసుకొని వచ్చింది తల్లితో.

రమణమ్మని చూడగానే సునీత- 'ఏమే చిరిగిపోయిన గౌనేసుకొచ్చావు? ఉండు" అని లోనికెళ్ళి "ఇదిగో, ఈ గౌను తీసుకో. ఒళ్ళంతా చినిగిపోయిన ఆ గౌనేంటి అసహ్యంగా" అంది. పని మనిషి కూతురూ, తన కూతురూ ఒకే లాటి గౌనుసుకోవడం నచ్చని సునీత.

"వద్దమ్మా ! అది అలాటి గౌన్లేసుకోనంటుంది. దీని గౌనే మా సెల్లెలు కూతురొస్తే ఇచ్చేసినాది" అంది గంగమ్మ

"అదేం"?

"ఆ గౌనేసుకొస్తే మీరు కాఫీ, టిఫిన్లివ్వడం నేదంట. అది ఆకలికుండ లేదమ్మా. అందుకే ఆ గౌను దొడుక్కోనంది" గంగమ్మ అన్న మాటలకి సునీత కాస్సేపు అలానే వుండిపోయింది.

గోపాలం షాకు తిన్నాడు.

'పేదవాళ్ళకి ఆకలి తరువాతే తక్కిన అవసరాలు' - అన్న నిజం సునీతకు అర్థమౌతుందా ఇప్పటికైనా?' అనుకున్నాడు.

(ఆగష్టు 1996 స్వాతిమాసపత్రిక నుండి)

❀ ❀ ❀ ❀